క్లుప్తంగా

రేపు క్రికెట్ సెలక్షన్స్

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ ట్వంటీ-ట్వంటీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ట్వంటీ ట్వంటీ రాష్ట్ర జట్టు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ భాస్కర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి నాజరుపేటలోని లూథరన్ స్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఎంపికైన జట్టు జూన్ 5వ తేదీ నుండి కేరళలో జరగనున్న నేషనల్ క్యాష్‌ప్రైజ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని చెప్పారు. వివరాలకు 7989215572 నంబరులో సంప్రదించాలన్నారు.

మజ్జిగ పంపిణీ



తెనాలిరూరల్: రైల్వేస్టేషన్ వంతెన వద్ద శ్రీ శివ లింగేశ్వర స్వామి భక్త బంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శుక్రవారం దాహార్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి ఆధ్వర్యంలో వరుసగా ఈ సంవత్సరం కూడా ఇక్కడ చలివేంద్రం సేవలు చేపట్టగా వివిధ ప్రాంతాల నుండి పట్టణానికి వచ్చి వెళ్లే ప్రజలు దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు వైష్ణవి కాలేజీ ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు సహకారంతో దాహార్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు మాస్టారు, షేక్ మీరావళి, ఎస్ఆర్‌కె శర్మ, పాశం వెంకటేష్, మునిపల్లి వంశీ, బంగారు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి, పెనుమాకలోని చిగురు బాలల గ్రామంలో ఉన్న పునరుతేజం విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలతో జీవితాన్ని అర్థాంతరంగా ముగించవద్దని సూచించారు. వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి డీ ఎడిక్షన చికిత్స ఉందని, ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాలభవన్ సంస్థ వారు నూజివీడులో బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని, పెజ్జోని పేటలో ఏర్పాటు చేసిన నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా 9490492020ను సంప్రదించవచ్చని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ హెచ్‌ఆర్ మేనేజర్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ యస్ జోసెఫ్ డోనాల్డ్, జోనల్ కో ఆర్డినేటర్ బి. రమేష్ పాల్గొన్నారు.

కాలువల సుందరీకరణపై అవగాహనకు శ్రీకారం



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు కాలువల సుందరీకరణకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. సాక్ డైరెక్టర్ సాయి విజయ్ మాట్లాడుతూ కేఎల్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు సోషల్ ఇంటెర్న్‌షిప్‌లో భాగంగా విజయవాడలో ఉన్న వివిధ కాలువల సుందరీకరణపై అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. కాలువల పరిరక్షణ, నిర్వహణ, ఆధునీకరణపై వీధి వ్యాపారులకు, కాలువ పరిసర ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. విజయవాడలోని రైవస్ కాలువ, ఏలూరు కాలువ, బందరు కాలువల సర్వే నిర్వహించారని, కాలువలో స్వచ్ఛమైన కృష్ణా నది ప్రవహించాల్సి ఉండగా స్థానికులు, ప్రయాణికులు వేస్తున్న వ్యర్థాల కారణంగా నీరు పూర్తిగా కలుషితం అయిందని సర్వేలో తెలుసుకున్నారని అన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా మరియు గోదావరి కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించామని అన్నారు. కార్యక్రమాన్ని విజయవాడ మున్సిపల్ అదనపు కమిషనర్ కె.వి. సత్యవతి హాజరై విద్యార్థులను అభినందించారు.

టైలరింగ్ షాపులో అగ్నిప్రమాదం

తెనాలిరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా టైలరింగ్ షాపులో అగ్నిప్రమాదం జరిగిన ఘటన శుక్రవారం తెనాలి సుల్తానాబాద్‌లో జరిగింది. పట్టణ పాండురంగపేటకు చెందిన బి. రాంబాబు సుల్తానాబాద్‌లోని అమ్మవారి గుడి సమీపంలో దుకాణం అద్దెకు తీసుకుని కొంతకాలంగా టైలరింగ్ షాపు నడుపుకుంటున్నాడు. దుకాణంలో తెల్లవారుజామున మంటలు చెలరేగి దుకాణంలోని టైలరింగ్ మిషన్లు, దుస్తులు కాలిబూడదయ్యాయి.

ప్రభుత్వ బడులకు పూర్తి భద్రత

- జెడ్పీ హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు
- పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు చర్యలు
- నియోజకవర్గంలో 17 హైస్కూళ్లలో పూర్తి స్థాయిలో ఏర్పాటు



కొల్లిపర మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

కొల్లిపర: పాఠశాలల్లో కంప్యూటర్లు చోరీకి గురికావడం, రాత్రి వేళల్లో స్కూళ్లలో కొంత మంది ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, స్కూలు రికార్డులు మాయం చేయడం వంటి సంఘటనలు కోకొల్లలు, సాయంత్రం పాఠశాలలు మూసివేసి ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటికి వెళ్లిపోయిన తరువాత ఎవరి పర్యవేక్షణ లేక పోవడం వల్లే అలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటివి పునరావృతం కాకుడదని ప్రభుత్వం హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైపోయిన విద్యావ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. పాడుబడిన పాఠశాలలను నాడు-నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించడంతో పాటు సకల సౌకర్యాలను ఏర్పాటు చేశారు. హైస్కూళ్లలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, కంప్యూటర్ పరికరాలు , ఇతర సామగ్రి కాపాడుకునేందుకు ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌లను నియమించేందుకు నిర్ణయం తీసుకుని నియమించటంతో ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీ హైస్కూళ్లలో ఏళ్ల తరబడి నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో చాలాసార్లు చోరీలు, ఆకతాయిలు మద్యం సేవించి సీసాలు పగలగొట్టం, తలుపులు, కిటికీలు పగల కొట్టడం జరిగాయి. కొన్నిచోట్ల పాఠశాల ఆవరణలో పశువులు చొరబడి నీడ నిచ్చే మొక్కలను, ధ్వంసం చేస్తున్నాయి. వీటన్నింటినీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి మౌనంగా భరిస్తూ వస్తున్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయం వారికి ఊరటనిస్తుంది.

స్థానికులకే ప్రాధాన్యం

నెలకు రూ.6వేలు గౌరవ వేతనంతో నియమించే నైట్ వాచ్‌మెన్ పోస్టులకు సంబంధించి ఆదే హైస్కూల్‌లో పనిచేసే మహిళ భర్తకు ప్రాధాన్యం ఇవ్వాలని, 60 ఏళ్ల లోపు వయస్సు ఎక్స్ సర్వీస్ మెన్ లేదా పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని నియమించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ షరతుల ప్రకారం ఎంఈఓ, హెచ్‌ఎంలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో నమ్మకంగా పనిచేసే వాచ్‌మెన్‌లను నియమించుకున్నారు.

నియోజకవర్గంలో 17 హైస్కూలు

తెనాలి నియోజకర్గంలో తెనాలి మండంలో 11 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, కొల్లిపర మండలంలో 6 హైస్కూల్‌లు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వం ఆదేశాల మేరకు మే 1 నాటికి పూర్తి స్థాయిలో నైట్ వాచ్‌మెన్లను నియమించారు.

హైస్కూళ్లకు పూర్తి రక్షణ



హైస్కూళ్లకు నెట్ వాచ్‌మెన్‌లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయం ఎంతో అభినందనీయం, గతంలో చాలసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం, ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌ల నియామకం పై జీఓ జారీ చేయడంతో హైస్కూళ్ల ఆస్తులకు రక్షణ ఏర్పడింది.అన్ని హైస్కూళ్లకు వాచ్‌మెన్‌లను నియమించాం.

–ఎం.లక్ష్మీనారాయణ, ఎంఈవో,

మద్దతు ధరపై మొక్కజొన్న కొనుగోలు ప్రారంభం



మున్నంగి ఆర్‌బీకేలో రైతుల వద్ద నుంచి మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం

మున్నంగి (కొల్లిపర): మండలంలోని రైతుభరోసా కేంద్రంలో రైతుల వద్ద నుంచి ప్రభుత్వం మొక్కజొన్న క్వింటా మద్దతు ధర రూ.1962 పై కొనుగోలు చేస్తుందని ఏవో కె.వెంకటరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని మున్నంగి గ్రామంలోని ఆర్బీకే 2 కేంద్రంలో రైతుల వద్ద నుంచి మొక్క జొన్న కొనుగోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో మధ్యవర్తులు మొక్కజొన్న క్వింటాకు రూ.1750 కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కావున రైతులు ఎవ్వరూ మధ్యవర్తులకు తక్కువ ధరకు అమ్ముకోకుండా మధ్యవర్తులు మాటలు నమ్మకుండా ఎటువంటి అపోహలు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్బీకే కేంద్రంలో ప్రభుత్వం మద్దతు ధరకు మాత్రమే అమ్ముకోవాలని, అధిక లాభాలు పొందాలని కోరారు. గ్రామానికి చెందిన వంగా జయరామిరెడ్డి వద్ద నుంచి 173 క్వింటాలు మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ నెల 12న కొల్లిపర 3 ఆర్బీకే కేంద్రంలో గుదిబండ సుధాకర్‌రెడ్డి, గుదిబండి శ్రీనివాసరెడ్డి కలసి 200 క్వింటాలు మొక్కజొన్నలు వేయగా 18న వారి ఖాతాలో రూ.3 లక్షల 92 వేల 400 జమ అయినట్లు తెలిపారు. వీరు కొనుగోలు కేంద్రాలకు మొక్కజొన్న వేసిన ఆరు రోజుల్లో మొత్తం జమ కావటంతో రైతులు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలిపారు. మొక్కజొన్న రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచముఖుడి సన్నిధిలో ఘనంగా హోమం



హోమం చేస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు, హనుమాన్ చాలీసా పారాయణ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హోమం నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణ, సుందరకాండ పారాయణ జరిపారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, సంకీర్తనా బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, సేవా సమితి సెక్రటరీ మూర్తి వెంకటేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, లీలాప్రసాదరావు, వెంకటేష్, బృందం సభ్యులు పద్మావతి, విజయలక్ష్మి, లక్ష్మీసునీత, రామలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

28 నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

తెనాలిరూరల్: స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య తెనాలి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాశం వెంకటేష్, బందెల నాసర్‌జీ మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ విద్య పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి లక్షల రూపాయలు దోచుకుంటున్నారని అన్నారు. పాఠ్య పుస్తకాలు అమ్ముతూ, ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యా సంస్థల పై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ బోర్డు రూల్స్ పాటించకుండా, అనుమతులు లేని భవనాలలో కళాశాలలను, పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు, వేసవి సెలవులలో కూడా కళాశాల నిర్వహిస్తు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో యాజమాన్యం ఒత్తిడికి గురై విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కాబట్టి తక్షణమే అధికారులు విద్యా సంస్థలను తనిఖీ చేసి అనుమతులు లేని భవనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేసారు. ఈ నెల 28 నుండి 30 వరకు భీమవరంలో ఏఐఎస్ఎఫ్ కోస్తాంధ్ర రాజకీయ శిక్షణ తరగతులు జరగనున్నాయని ఈ శిక్షణ తరగతులకు తెనాలి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొనీ జయప్రదం చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు అన్నం అరవింద్, నీరజ్ సాయి, శ్రీను, కోలా శేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ నాయకుడికి నివాళి



నివాళులర్పిస్తున్న రాజకుమారి

తెనాలిరూరల్: మండల పరిధిలోని అంగలకుదురు గ్రామానికి చెందిన ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ నాయకుడు వీరవల్లి ఆదినారాయణ ప్రథమ వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని వారి నివాసం వద్ద ఏర్పాటు చేసిన సంస్మరణ సభా కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ఆదినారాయణ చిత్ర పటం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆదినారాయణ కుమారుడు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళీ, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఎన్టీఆర్ ట్రస్ట్ డైరెక్టర్ మన్నవ కృష్ణమోహన్ సహా పలువురు నాయకులు ఆదినారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆర్టీసీ ఉద్యోగిగా ఆదినారాయణ కార్మిక సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో అంగలకుదురు గ్రామస్తులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



పేదలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకుడు శివసాంబిరెడ్డి



మాట్లాడుతున్న కొల్లిపర బాబూప్రసాద్

తెనాలిటౌన్: దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత, కమ్యూనిస్ట్ గాంధీ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని రూరల్ మండలం కంచర్లపాలెంగ్రామంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం డివిజన్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ కార్యకర్త చుక్కపల్లి శేషగిరిరావు సీపీఎం పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేదలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు శివసాంబిరెడ్డి మాట్లాడుతూ సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికి దేశంలో వ్యవసాయ కార్మికుల కోసం వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మించారని తెలిపారు. పార్లమెంట్, అసెంబ్లీలకు సైకిల్‌పై వెళ్ళిన నిరాండంబరుడని అని తెలిపారు. ఈనాటి రాజకీయ నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకుకోవాలని కోరారు. భూసంస్కరణ ఎజెండాలోకి తెచ్చిన సుందరయ్య తెలంగాణా సాయుధ పోరాట యోధుడుగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చుక్కపల్లి ప్రభాకరరావు, నాయకులు యర్రగుంట దేవసహాయం, బుల్లా యేసురత్నం, పాదిలి కృష్ణ, బేతపూడి కృష్ణారావు, కవెవరపు ప్రభాకర్, చుక్కపల్లి చైతన్య, బాల వంశీ, చెరుకూరి శంకరరావు, చుక్కపల్లి ప్రసాద్, గన్నమనేని భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో....

తెనాలి: కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. సీపీఎం తెనాలి డివిజన్ కార్యకర్తలు సుందరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన ఆశయ సాధనకు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పార్టీ తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ అగ్రశ్రేణి నాయకులు తొలి పదిమందిలో సుందరయ్య ఒకరని గుర్తుచేశారు. ప్రజాపోరాటాల్లో కాకలు తీరిన మహాయోధుడని, కమ్యూనిస్టులకే ఆదర్శ కమ్యూనిస్టు అని చెప్పారు. సుందరయ్య జీవితవిశేషాలను, కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, మంగళగిరి వెంకటేశ్వర్లు, ఎస్.రాజ్యలక్ష్మి, రాచూరి వెంకటేశ్వర్లు, ముత్యాల కనకయ్య, గంగల పద్మ, ఎం.సాంబశివరావు, షేక్ మౌలాలి, రాచూరి గౌరి తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ప్రారంభం



క్విజ్ విజేతలకు బహుమతుల ప్రదానం

తెనాలి: స్థానిక నన్నపనేని వెంకట్రావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌ను ప్రారంభించారు. శ్రీచైతన్య కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.సునీల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యాక్టివిటీ సెంటర్లతో విద్యార్థుల విజ్ఞానం మెరుగుపడుతుందనీ, భవిష్యత్‌లో నాయకత్వ లక్షణాలు మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామారావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం యాక్టివిటీ సెంటర్లో విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచే కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

తొలిరోజున టెక్నికల్ క్విజ్‌ను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కాలేజీ కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

బాబు వ్యాఖ్యలకు నిరసన సెగ

చంద్రబాబు గడ్డిబొమ్మ దహనం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



గాంధీచౌక్‌లో వైఎస్సార్ సీపీ నేతల నిరసన



చంద్రబాబు గడ్డిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

తెనాలి: ప్రభుత్వం సమకూర్చిన ఇళ్లస్థలాలపై పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలను కించపరచేలా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'మీకు ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుంది' అంటూ చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో దేశంలో మరెక్కడా లేనట్టుగా రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని 30 లక్షల మంది పేదలకు ఇళ్లస్థలాలను ఇవ్వటం, అమరావతిలో 50 వేల మందికి ఇళ్లపట్టాలు ఇవ్వటానికి నిర్ణయించటంతో చంద్రబాబు నాయుడు అప్రజాస్వామిక, అహంకారపూరితంగా చేసిన వ్యాఖ్యలపై పెద ఎత్తున నిరసన తెలియజేశారు. వైఎస్సార్ సీపీకి చెందిన బడుగు, బలహీన, దళిత, మైనారిటీ వర్గాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు శుక్రవారం సాయంత్రం స్థానిక గాంధీ చౌక్‌లో నిరసన ప్రదర్శన చేశారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన గడ్డిబొమ్మను దగ్ధంచేశారు. నిలువనీడ లేని పేదలకు చంద్రబాబునాయుడు తన హయాంలో సెంటుస్థలం ఇవ్వలేదని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ గుర్తుచేశారు. సెంటు విస్తీర్ణంకన్నా తక్కువ వైశాల్యంలో టిడ్కో గృహాలను నిర్మించి ఇస్తామని అవి కూడా పూర్తి చేయకుండా గద్దె దిగిపోయారని చెప్పారు. ఇప్పుడు అంతకుమించిన విస్తీర్ణంతో లక్షలాది మంది పేదలకు ఇళ్లస్థలాలనిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లు కూడా నిర్మించి ఇస్తున్నారని తెలిపారు. ఈ వాస్తవాలను జీర్ణించుకోలేని చంద్రబాబు, పేదలను కించపరచేలా వ్యాఖ్యలు చేయటం దారుణమన్నారు. పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇళ్లస్థలాలు శవాల్ని పూడ్చేందుకు కూడా సరిపోవంటూ చంద్రబాబు వ్యాఖ్యానించటం దుర్మార్గమన్నారు. చింకా సురేష్‌యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబుకు పేదలన్నా, దళితులన్నా చులకనగా మాట్లాడుతారన్నారు. నిరసనలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, అవుతు నగేష్‌రెడ్డి, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, బచ్చనబోయిన శ్రీనివాసరావు, పార్టీ నేతలు దేసు శ్రీనివాసరావు, మద్దాళి శేషాచలం, అక్కిదాసు కిరణ్, చింకా సురేష్, భాస్కరుని శ్రీనివాసరావు, చుండూరు సాయి, భాస్కరుని లక్ష్మీనారాయణ, అత్తోట చంటి, హరిదాసు గౌరీశంకర్, కుర్రా శ్రీను, మల్లెబోయిన రాము, షేక్ మీరావలి, కొల్లా గురునాధగుప్తా, కరాటపు రాజమోహన్, బెజ్జం బాజీ, నాగపూర్ణేశ్వరరావు, ఉన్నవ రాజేష్ పాల్గొన్నారు.

పర్యావరణ రహిత జీవన విధానం మేలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ శాఖాధికారులు, సిబ్బంది

మోతడక(తాడికొండ): పర్యావరణ రహిత జీవన విధానంతో ఆరోగ్యానికి మేలు చేస్తుందని అటవీ శాఖాధికారి ఎస్.రామచంద్రయ్య అన్నారు. చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో పర్యావరణ హిత జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంధన, జల వనరుల సంరక్షణ, ఈ వ్యర్థాలను తగ్గించడం, సుస్థిర ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ తిరిగి వినియోగించవద్దని, ఆరోగ్యకరమైన జీవన విధానాలను అలవర్చుకోవాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి రోజువారీ జీవితంలో సాధ్యమయ్యే మార్పులు, పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుతామంటూ విద్యార్థులతో అటవీ శాఖాధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ వీరేశలింగం నాయుడు, ఏపీసీ వేణుగోపాల్, బీట్ ఆఫీసర్‌లు ఎంపీ రామకృష్ణ, కె.నరసింహా రెడ్డి, షేక్ జానీ బాషా, వైస్ ప్రిన్సిపాల్ కె.కిరణ్ కుమార్, ప్రొఫెసర్ నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాటక కళాకారుడు శ్రీనివాసరావుకు సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న రమేష్, వెంకట్రావు తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం విశ్వరూపం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు పులివర్తి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్, కొచ్చెర్ల వెంకట్రావు, మునిపలిల దుర్గాప్రసాద్, కొడాలి సుబ్రహ్మణ్యం, పందిటి ప్రసాద్‌బాబు, ఉప్పాల శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్యపాల్గొన్నారు.

విద్యను వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలను సీజ్‌చేయాలి

తెనాలి: విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ సంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్, తెనాలి నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం శుక్రవారం ఏర్పాటుచేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాశం వెంకటేష్, బందెల నాసర్‌జీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పాఠ్యపుస్తకాలను అమ్ముతూ, ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈనెల 18-30 తేదీల్లో భీమవరంలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ కోస్తాంధ్ర రాజకీయ శిక్షణ తరగతులలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గ నాయకులు అన్నం అరవింద్, నీరజ్‌సాయి, శ్రీను, కోలా శేఖర్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఓపీలో వాటర్ కూలర్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఓపీ విభాగం వద్ద గుంటూరు శ్రీనగర్‌కు చెందిన పట్టపు గోపి ఆర్థిక సహాయంతో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి వాటర్ కూలర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. పట్టపు బసవపున్నయ్య జ్ఞాపకార్థం రూ. 50 వేలతో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేసినట్లు గోపి తెలిపారు. వాటర్ కూలర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని డాక్టర్ ప్రభావతి అన్నారు. కార్యక్రమం లో సివిల్ సర్జన్ ఆర్ యం ఓ డాక్టర్ సతీష్ కుమార్, డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, శానిటేషన్ అధికారి దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పేదలపై బాబు చేసిన వ్యాఖ్యలకు నిరసన

తాడికొండ: సెంటు స్థలం శవం పూడ్చడానికి చాలదంటూ చంద్రబాబు నాయుడు చేసిన అప్రజాస్వామిక వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. బాబు వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తాడికొండ పోలీస్ స్టేషన్ కూడలి నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలంటే మొదటి నుంచి చులకనగా చూసే చంద్రబాబు పేదలను కించపరిచే విధంగా వ్యాఖ్యానించడం సిగ్గుచేటని చెప్పారు. బాబు వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

గాయపడిన జెడ్పీటీసీ భర్తకు పరామర్శ

తాడికొండ: గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి భర్త గుడిమెట్ల వీర్లంకయ్యను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. ఘటనపై బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎస్ఐ నాగార్జునకు సూచించారు.